ప్రజలకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా ప్రజలకు కలెక్టర్ కృతికా శుక్లా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ శనివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగ అని, గ్రామానికి నూతన శోభను తెచ్చే పండుగ, మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని అన్నారు. బంధు మిత్రుల సందళ్ళతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అని, ప్రతి ఇంటింటిలోనూ, ప్రతి ప్రాంతంలోనూ, ప్రతి మారుమూల పల్లె లోనూ, ప్రతి ఒక్కరూ సంతోషాలతో సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలందరూ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సై అంటున్న పందెం కోళ్లు..

- జూదాలకు ఏర్పాట్లులో నిర్వాహకులు
- రూ. కోట్లు అక్రమ వ్యాపారానికి సిద్ధమైన అధికార పార్టీ నేతలు
- ఎన్నికల సంవత్సరం కావడంతో అత్యుత్సాహం

తాళ్లరేవు మండలం జార్జిపేటలో కోడిపందేలా కోసం సిద్ధం చేస్తున్న బరి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల సంవత్సరం కావడంతో ఈ సారి సంక్రాంతి కోడి పందేలకు చాలా ప్రాధాన్యత ఉంది. దాంతో అధికార పార్టీ పెద్దలు కోడి పందేలు చాటున పెద్ద ఎత్తున జూదాలకు తెరలేపనున్నారు. పేకాట, గుండాట ద్వారా భారీగా సొమ్ములు వెనుకేసుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల హెచ్చరికలు పక్కన పెట్టి పండుగ మూడు రోజులూ జూదాలు ఆడించేందుకు సిద్ధ పడ్డారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో చిన్న, పెద్ద, భారీ బరులు ఏర్పాటయ్యాయి.

సంక్రాంతి సంప్రదాయం ముసుగులో కోడిపందాలు, జూదాల జాతరకు ఉమ్మడి జిల్లాలో రంగం సిద్ధమవుతుంది. ఆదివారం నుంచి ముహూర్తం ఖరారు కాబోతోంది. భోగి పండుగ నాడు పందాలకు తెరలేవనుంది. సంక్రాంతి మూడు రోజులు కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. ప్రతీ ఏటా మాదిరిగానే జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. పలు మైదానాలను బరులుగా చేశారు. బరులు, పందెం శిబిరాల వద్ద మూడు రోజులపాటు గుండాట, పేకాట, మద్యం, బెల్టు షాపులు, సారా విక్రయాలు, బిర్యాణీ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే వేలం పాటలు కూడా జరుగుతున్నాయి. రూ.లక్షల్లో పందేలు కాస్తున్న పందెం రాయుళ్లు ఉత్సాహంగా పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా కోట్లలో సొమ్ములు కోడి పందేలు, జూదాలు ద్వారా చేతులు మారే అవకాశం కనిపిస్తోంది.

తగ్గని పందెం రాయుళ్లు

ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పందేలకు అనుమతులు వస్తాయనే ఆలోచనతో నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలతోపాటు బరులు ఏర్పాటు చేయకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నా పందెం రాయుళ్లు వెనుకంజ వేయడం లేదు. ప్రధానంగా కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం, ఐ. పోలవరం, కాట్రేనికోన, అమలాపురం, అంబాజిపేట, ఆయి నవిల్లి, రాజోలు, మల్కిపురం, పి.గన్నవరం, మామిడి కుదురు, కొత్తపేట, ఉప్పలగుప్తం, కపిలేశ్వరపురం, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, గోకవరం, పెద్దాపురం, సామర్లకోట, తొండంగి, సీతానగరం, రాజానగరం తదితర మండలాల్లో పందేలు, జూదాలు యథేచ్ఛగా జరుగనున్నాయి.

చేతులు మారనున్న రూ.500 కోట్లు

గతేడాది పోలీసులు ఎన్ని ఆంక్షలు, కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నా కోడిపందేలు ఆగలేదు. తొలుత కత్తుల్లేకుండా నిర్వహించి, ఆ తర్వాత భోగి పండగ నుంచి కోడి పుంజులకు కత్తులు కట్టి రక్తం చిందించారు. గత ఏడాది అధికార వైసిపి నేతలు నేరుగా పందేల్లో పాల్గొన్నారు. ఈసారి కూడా భోగి రోజు నుంచి పందేలు ముమ్మరం చేసేందుకు యత్నాలు సాగుతున్నాయి. ప్రధానంగా ఈసారి అధికార పార్టీ నేతలు జూదాలపై ఫోకస్ పెట్టారు. పేకాట, గుండాటలకు వేలంపాటలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొందరిని ఆకట్టుకునేందుకు జూదాలకు అధికార పార్టీ నేతలు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. గతేడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు రూ.400 కోట్లకు పైగా చేతులు మారినట్లు తెలిసింది. ఈసారి రూ.500 కోట్లుపైనే చేతులు మారే అవకాశం కనిపిస్తోంది.

మద్యం, సారా విక్రయాలకు ఏర్పాట్లు

మరోవైపు పెద్ద ఎత్తున మద్యం విక్రయాలకు అధికార పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నారు. జగన్ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం విక్రయాలను జరుపుతూ ఆదాయమే ప్రధానంగా ప్రభుత్వం బెల్ట్ షాపులను సైతం ప్రోత్సహిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ సారి సంక్రాంతిలో మద్యం విక్రయాలు జోరుగా సాగనున్నాయి. గుడుంబా విక్రయాలను కూడా జరిపేందుకు కొందరు వ్యాపారులు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా కోనసీమ, ఏజెన్సీ ప్రాంతాల్లో సారా జోరు ఎక్కువగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మద్యం అధిక విక్రయాలు, సారా నియంత్రణకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది ప్రశ్నార్థకం.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్, చిత్రంలో డిఎస్‌పి లతాకుమారి

కోడి పందేలపై కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు నిర్వహణపై హైకోర్టు నుంచి స్పష్టమైన నిషేధ ఆదేశాలు ఉన్నందున పందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌పి సతీష్ కుమార్ హెచ్చరించారు. శనివారం సామర్లకోట పోలీస స్టేషన్‌లో సిఐ ఛాంబర్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రిబ్బను కత్తిరించి సిఐ ఛాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, గుండాటలకు అనుమతి లేదన్నారు. ఇప్పటికే గత రెండు రోజులుగా ఎక్కడైతే కోడి పందాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే అక్కడకు తమ సిబ్బంది వెళ్లి ఏర్పాట్లను ధ్వంసం చేయడం, ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పందాలు నిర్వహిస్తే చట్టపరంగా తమ పని తాము చేస్తామని ఎస్‌పి హెచ్చరించారు. స్థానిక స్టేషన్‌లో సిఐ, ఎస్‌ఐ క్యాబిన్ల మధ్య పార్టేషన్ లేనికారణంగా ఇబ్బంది ఉందన్నారు. మొదట స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం ఎస్‌ఐ పరిధిలో జరగాల్సి ఉందన్నారు. ఆయన పరిధిలో పరిష్కారం కానీ సమస్యలు సిఐ వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. అయితే ఈ ప్రక్రియకు సంబంధించి సిఐ క్యాబిన్ వేరుగా లేనందున దానిని వేరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్లో కేసులు వాటి ఫిర్యాదులు, లా అండ్ ఆర్డర్ తదితర విషయాలపై సిబ్బందికి ఎస్‌పి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి, స్థానిక సిఐ సురేష్, ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్‌లో 1997-98 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి చదువుకున్న విద్యార్థు ల్లో తాటిపర్తి గ్రామానికి చెందిన గౌతు వల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. అతనితో చదువుకున్న మిత్రులు సంక్రాంతి సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా వల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి అతని భార్య నాగలక్ష్మి, కుమారుడు వీరేంద్ర సాయి, కుమార్తె చంద్రగిరిలకు రూ.1.20 లక్షల సాయాన్ని అందించారు.

స్నేహితుని కుమార్తెకు నగదును అందిస్తున్న స్నేహితులు

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా వాలీబాల్ పోటీలు మూడవరోజు హోరాహోరీ గా సాగాయి. మొదటి సెమీఫైనల్ పోటీలో భాగంగా భైరవపాలెం, గిరియంపేట జట్ల మధ్య ఆసక్తికరమైన పోటీ జరిగింది. భైరవపాలెం జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. అనంతరం పెదవలసల, బొడ్డు వెంకటయ్యపాలెం జట్ల మధ్య జరిగిన రసవత్తరమైన పోటీలో బొడ్డు వెంకటయ్యపాలెం గెలుపొంది ఫైనల్ కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో బిఎస్‌ఎఫ్. ఎస్‌ఐ. పెచ్చెట్టి కొండ, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, గుత్తుల సూర్యానారాయణ, బర్రె లక్ష్మీనరసింహరాజు, విత్తనాల శ్రీనివాసరావు, విల్ల వీరా, మట్టపర్తి లోవరాజు, కుడుపూడి శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేతలు

సమావేశంలో మాట్లాడుతున్న సత్యప్రభ

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రభుత్వం అడ్డగోలుగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ చట్టం వలన పేద బలహీన, చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అమ్మాయి బాబు మాట్లాడుతూ ప్రజల ఆస్తులపై వారికి హక్కు లేకుండా తీసుకువచ్చిన నల్ల చట్టాన్ని రద్దు చేసే వరకు ప్రతి ఒక్కరూ పోరాడాలని, జనసేన ఈ పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐలాజ్ అధ్యక్షుడు బుగతా శివ, రాష్ట్ర బిసి ఐక్య పోరాట సమితి నాయకుడు ఏపూరి శ్రీను, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు, సిపిఎం మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు మానుకొండ లచ్చబాబు, బిసివై పార్టీ నాయకురాలు అనూష యాదవ్, కిసాన్ సంఘ నాయకుడు ఎల్లపు సూర్యనారాయణ, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోరాడతాం.. సాధించి తీరతాం..

- అంగన్‌వాడీల నిరసన శిబిరాల్లో ప్రతిన
- ముగ్గుల్లో డిమాండ్లు ప్రతిబింబించేలా నిరసన

కాకినాడ ధర్నా చౌక్ వద్ద అంగన్‌వాడీల నిరసన దీక్ష

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రభుత్వం ఎంతటి నిర్బంధాన్ని ప్రయోగించినా..ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకు పోరాడుతాం..హక్కులను సాధించితీరుతాం అంటూ అంగన్‌వాడీలు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన అంగన్‌వాడీల నిరవధిక సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరింది. పండగైనా..పబ్బమైనా అన్నీ నిరసన శిబిరాల్లోనే అంటూ అంగన్‌వాడీలు సంక్రాంతిని పురష్కరించుకుని శనివారం నిరసన శిబిరాల వద్ద తమ డిమాండ్లు ప్రతిబింబించేలా ముగ్గులను వేసి రాష్ట్ర ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేశారు. **కాకినాడ** స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న నిరసన శిబిరం వద్ద సంక్రాంతిని పురష్కరించుకుని ముగ్గులను వేశారు. ఆ ముగ్గుల్లో తమ డిమాండ్లను ప్రతిబింబించేలా వేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి మాట్లాడుతూ మంత్రుల బృందంతో జరిగిన చర్చలు మరోసారి విఫలం అయ్యాయని తెలిపారు. చర్చల సందర్భంగా ప్రభుత్వం వేతనాలు పెంచలేమని పాత పాటనే పాడిందని, అలాంటప్పుడు చర్చలకు ఎందుకు పిలిచారో చెప్పాలని డిమాండ్ చేశారు. జులైలో వేతనాలు పెంచుతామని, అయితే ఎంత పెంచుతామో చెప్పలేమని, ఉత్తర్వులు కూడా ఇప్పుడు ఇవ్వలేమని మంత్రుల బృందంచెప్పడంతోనే సమ్మెను యథాతథంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిత్యం అన్నింటి ధరలను పెంచుతూ పాలన సాగిస్తున్న ప్రభుత్వం అంగన్‌వాడీలకు మాత్రం ఐదేళ్లకు ఒకసారి మాత్రమే వేతనాలు పెంచుతామనడం సిగ్గుచేటన్నారు. వేతనాలు పెంచేంతవరకు మా పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాయకులు రామా, వీరవేణి, మున్నీ, చామంతి, విజయ, శ్రీదేవి, అర్బన్, రూరల్ అంగన్‌వాడీలు, ఆయాలు సమ్మె సిబిరంలో కూర్చున్నారు. **పిఠాపురం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, సిఐటియు నాయకులు కె.చిన్న మాట్లాడుతూ చర్చల పేరుతో మంత్రుల బృందం పిలిచి బెదిరింపులకు పాల్పడుతుందని దుయ్యబటారు. నాలుగు నెలల తరువాత తమ ప్రభుత్వం మళ్లీ వస్తుందని, అప్పుడు జీతాలను పెంచుతామనడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు విజయశాంత, వి వెంకటలక్ష్మి, నళిని, ప్రజావాణి, బేబీరాణి, బి.వెంకటలక్ష్మి, రామలక్ష్మి, అమల, రాఘవమ్మపాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానిక పంచాయతి రాజ్ అతిధి గృహం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె వద్ద అంగన్‌వాడీలు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని, జీవో 2 ను రద్దు చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, రాజేశ్వరి, రామ్ లీలా ఉన్నారు .**పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్ వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు సంక్రాంతిని పురష్కరించుకుని రోడ్డుపై ముగ్గులు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు దాడి బేబీ మాట్లాడుతూ చర్చల పేరుతో ప్రభుత్వం అంగన్‌వాడీల జీవితాలతో ఆటలాడుకుంటుందని అన్నారు. చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఈ నెల 14 నుంచి జగనన్నకు చెబుదాం పేరుతో ప్రతి ఇంటి నుంచి సంతకాలు సేకరణ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు, యూనియన్ నాయకులు బేబీ, నాగమణి, అమల, ఎస్తేరురాణి, బాలం లక్ష్మి, టిఎల్.పద్మావతి, లోవతల్లి పాల్గొన్నారు. **కరప** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని తన మనవుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న గురజనాపల్లికి చెందిన అంగన్‌వాడీ ఆయా మంగ రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యింది. ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఆయాను సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, అంగన్‌వాడీ ఊనియన్ నాయకులు ఎం.వీరవేణి, ఎస్ వరలక్ష్మి, జిఎకెఎల్.నారాయణమ్మ, ఎం.భవాని, అచ్చరత్నం పరామర్శించారు.

పిఠాపురంలో ముగ్గులు వేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దాపురంలో ముగ్గులు వేస్తున్న అంగన్‌వాడీలు

కరపలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయా



జగ్గంపేటలో ముగ్గుల్లోనే అంగన్‌వాడీల డిమాండ్లు

కార్టూ'నిజం'

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు అన్నారు. మండల పరిధిలోని గంగనాపల్లి, కొవ్వాడ, రేపూరు, చీడిగ, ఇంద్రపాలెం, కొవ్వూరులోని తారకరామ నగర్, తూరంగి గ్రామాల్లో రూ.5.50 కోట్ల ప్రతిపాదనలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్ని పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. చీడిగ గ్రామంలో రూ.1.44 కోట్లతో నిర్మించిన రెండు వాటర్ ట్యాంకులు, తూరంగి గ్రామంలో రూ.91.33 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు. అనంతరం గంగనాపల్లి గ్రామంలో రూ.57.30. లక్షలతోనూ, కొవ్వాడలో రూ.25.80.లక్షలతోనూ, రేపూరులో రూ.31.50లక్షలతోనూ, చీడిగలో రూ.17.20 లక్షలతోనూ, కొవ్వూరు తారకరామ నగర్లో రూ.31.50 లక్షలతోనూ, తూరంగిలో రూ.114.20లక్షలతో నిర్మించే ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు పైప్ లైన్ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి జల జీవన్ మిషన్ పథకం ద్వారా కనెక్షన్లు వేయించి ప్రతి ఇంటికీ సురక్షిత రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పైప్ లైన్ పనులను త్వరితగతిని ప్రారంభం చేయించి ఇప్పటికే అనేక గ్రామాల్లో పనులు పూర్తి చేయించి మంచి నీరు అందిస్తున్నామన్నారు. పైపులైన్ల నిర్మాణం పూర్తయితే ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు

కార్మికులకు యూనిఫారం పంపిణీ

యూనిఫాంను అందచేస్తున్న ఛైర్‌పర్సన్ తులసి మంగతాయారు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగం, వాటర్ వర్క్స్ విభాగాలలో పనిచేస్తున్న 47 మంది పర్మినెంట్ కార్మికులకు యూనిఫాంను అందచేశారు. శనివారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మిల చేతుల మీదుగా మూడు జతలు చొప్పున యూనిఫాం, తువాళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరేళ్ల వీరరాఘవ, త్సలికి సత్యభాస్కరరావు, విడదాసరి రాజా, కొట్టి కిషోర్, కట్టా రాజబాబు, కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ,షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ (సిఐటియు) శనివారం ఉదయం ఆసుపత్రి మాతా శిశు విభాగం వద్ద ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ విజయ్ కుమార్ మాట్లాడుతూ గత చాలా కాలంగా జిజిహెచ్‌లో శానిటేషన్ వర్కర్స్‌గా కాంట్రాక్టు పద్ధతిలో సేవలు అందిస్తున్నామన్నారు. అయితే ఎన్నడూ లేనివిధంగా పిఎఫ్, ఇఎస్‌ఐ యజ మానులు చెల్లించవలసిన వాటా కూడా కార్మికుల జీతాల నుంచే మినహాయిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ సహా అధికారులు అందరికీ వినతి పత్రాలు సమర్పించినా న్యాయం జరగలేదన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలి వెల వీరబాబు మాట్లాడుతూ కృష్ణా కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ 2021 జూన్ నుండి జిజిహెచ్ లో శానిటేషన్ కాంట్రాక్టు నిర్వహిస్తుందన్నారు. పిఎఫ్, ఇఎస్‌ఐ యజమానులు చెల్లించవలసిన వాటా నెలకు సుమారు రూ.1,400లను కత్తిరించారని,ఆ సొమ్మంతా కార్మికుల ఖాతాలకు జమచేయాలన్నారు. సంక్రాంతి తరువాత దశల వారీగా ఆందోళన చేయడానికి కార్మికులు సిద్ధమవుతున్నారని, జరగబోయే పరిణామాలకు అధికారులు, కాంట్రాక్టు సంస్థ వారే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్.రమేష్, ఎస్. వాసు, పుష్ప, రమణమ్మ, దుర్గా ప్రసాద్, శ్రీకాంత్, ఏసు, రవి, వివిఎన్ కుమార్ పాల్గొన్నారు..

జిజిహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న శానిటేషన్ వర్కర్లు

అంగన్‌వాడీలకు సంక్రాంతి ఏదీ..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీలకు సంక్రాంతి పండుగ సందడి లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా విధించడం పట్ల సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా వైయస్‌ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని 33 రోజులుగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెబాట పట్టిన విషయం విదితమే. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీల కుటుంబాలు క్రిస్మస్‌, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు సైతం దూరమై వీధుల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం కనీసం ఆలోచన చేయకపోవడం నియంతృత్వ వైఖరిని దర్పణం పట్టింది. అత్యవసర సర్వీసుల పరిధిలోకి తీసుకొచ్చి ఎస్మా ప్రయోగించడం చట్టవిరుద్ధమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో అంగన్‌వాడీ ఉద్యమం పట్ల అనుచితంగా వ్యవహరించిన విషయం విదితమే. గుర్రాలతో తొక్కించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే టిడిపి దాదాపు పదేళ్ల అధికారానికి దూరమైంది. వైసిపి ప్రభుత్వమూ రాబోయే రోజుల్లో అధికారానికి దూరం కావటం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చంద్రబాబు రాకతో టిడిపిలో ఉత్సాహం

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు రాకతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం సెంట్రల్‌ జైలు నుంచి విడుదలైన అనంతరం తొలిసారి ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడలో నిర్వహించిన సభకు చంద్రబాబు హాజరయ్యారు. వైసిపి నేతలు తిన్నదంతా కక్కిస్తామంటూ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు జనసేన, టిడిపి ఉమ్మడి జాబితా విడుదల చేయనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అధినేత రాక ప్రత్యేక సంతరించుకుంది. దీంతో జిల్లాలోని పార్టీ ముఖ్య నేతలు అధినేతను కలిసేందుకు క్యూ కట్టారు. ఎవరికి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. గత వారంలో జనసేన

అధినేత సైతం జనసేన నేతలతో సమీక్షలు నిర్వహించారు. ఆ రెండుపార్టీల సీట్ల సర్దుబాట్లపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆశావహులంతా తమలో ఉత్సాహాన్ని నింపేలా ప్రకటన చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ముగ్గుల పోటీలతో మహిళలకు ఎర

సంక్రాంతి సంబరాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల పేరుతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన కూటమి మహిళా ఓటర్లకు బహుమతులు ఎర వేయడంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కాసు బంగారం, బైకులు పంపిణీ చేయటం చర్చనీయాంశమైంది. మరి కొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నాలుగేళ్లలో క్రీడాకారులకు ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వని వైసిపి ప్రభుత్వం ఆడుదాం- ఆంధ్రా పేరుతో పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. విజేతలకు నగదు బహుమతులు ప్రకటించడంతో పాటు రూ.100 కోట్ల బడ్జెట్‌ కేటాయించడం విమర్శలకు దారి తీసింది. మొత్తం మీద ఎన్నికల ప్రకటనకు ముందే ఓటర్లను ప్రలోభాల ఎరవేసేందుకు ఆయా పార్టీలు పోటీపడుతున్నాయి.

హోమ్‌ మినిస్టర్‌ ఇలాఖాలోనూ కోడి పందేలు

సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలకు రంగం సిద్ధమవుతోంది. పోలీసు, రెవెన్యూ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. సాక్షాత్తూ హోం మంత్రి ఇలాఖాలో కోడి పందేలకు బరులు సిద్ధం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఎస్‌పి జగదీష్‌ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు క్షేత్రస్థాయి పర్యటించి పలు బరులు ధ్వంసం చేశారు. ఈ జాబితాలో హోమ్‌ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొవ్వూరు, అనపర్తి ఎంఎల్‌ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి నియోజక వర్గమైన అనపర్తి లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

నేరాలు ఘోరాలు

యానాం మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ఐ.పోలవరం

యానాం నుంచి గుంటూరుకు కారులో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం తెల్లవారు జామున పోలీసులు పట్టుకొన్నారు. వివరాలు ఇవి.. పాతఇంజరం-ఎదుర్లంక చెక్‌ పోస్టు వద్ద యానాం నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా 348 బాటిళ్ల పట్టుకొన్నారు. ఇవి రూ.1.48 లక్షలు విలువచేస్తాయని ఎస్‌ఐ సిహెచ్‌.రాజేష్‌ తెలిపారు. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాట్రేనికోన మండల పరిధిలోని మత్యకార గ్రామమైన పల్లంలో యానాం మద్యం విక్రయిస్తున్న మల్లాడి వెంకట్రావు అలియాస్‌ సత్తియను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. అతని నుండి 254 యానాం మద్యం బాటిల్స్‌ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సారా విక్రయం కేసులో ఇద్దరికి రిమాండ్‌

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్‌

స్థానిక కుమ్మరి వీధిలో 20 లీటర్ల నాటు సారాతో పట్టుబడిన ఇద్దరు మహిళలకు కాకినాడ ఎక్సైజ్‌ కోర్టు 14 రోజులు రిమాండ్‌ విధించింది. ఎక్సైజ్‌ నార్త్‌ స్టేషన్‌ సిఐ కె.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శనివారం సామర్లకోట కుమ్మరి వీధిలో నాటుసారా విక్రయాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా విక్రయిస్తున్న గుబ్బల పార్వతి, గుబ్బల వీరయమ్మలను అదుపులోకి తీసుకుని వారి నుండి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఇరువురికి 14 రోజులు రిమాండ్‌ ను కోర్టు విధించింది. అలాగే నాటు సారా సరఫరా చేస్తున్న అదే ప్రాంతానికి చెందిన దంగేటి రాజు అనే వ్యక్తిపైన ఎక్సైజ్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్జాతీయ సదస్సుకు కాకినాడ ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వ ఎర్త్‌ సైన్సెస్‌ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్‌ సైన్స్‌ ఫెస్టివల్‌ కు కాకినాడ గోదరిగుంట మదర్‌ థెరిస్సా మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న కెఆర్‌ఎస్‌.చంద్రారెడ్డికి ఆహ్వానం అందింది. జీవశాస్త్ర బోధనలో నూతన పోకడలు అనే అంశం పై పరిశోధన పత్రాన్ని ఈ సదస్సులో సమర్పిస్తారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20 వరకూ జరగనున్న ఇండియా ఇంటర్నేషనల్‌ సైన్స్‌ ఫెస్టివల్‌ దేశ విదేశాల శాస్త్రవేత్తలతో పాటు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడి పాల్గొంటారు. ఎంపికైనా ఉపాధ్యాయుడు కెఆర్‌ఎస్‌. చంద్రారెడ్డిని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యా శాఖాధికారి జి.నాగమణి, అదనపు సంయుక్త సంచాలకులు, విద్యాశాఖ పి.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్‌ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌కె.డేనియల్‌ రాజు, జిల్లా సైన్స్‌ అధికారి ఎ.ఎస్‌ విలీల్‌, జాతీయ బాలల సైన్స్‌ కాంగ్రెస్‌ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు ఎంఇఒలు విపిజి. వాణీ కుమారి, సిహెచ్‌.రవి, పాఠశాల హెచ్‌ఎం వై.శ్రీనివాస్‌ అభినందించారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

కోటనందూరులో ప్రచారం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కోటనందూరు, రౌతులపూడి, కాజులూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, గుండాట, ఇతర జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బి.శంకర్రావు హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించే ఇందిని భద్రపరచకోవడం కోసం తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. 17 గ్రామపంచాయతీ లోనూ ఆటో ద్వారా ప్రచారం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అలాగే రౌతులపూడి మండలంలో సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, పేకాట, ఇతర జూదాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ అబ్దుల్‌ నబీ శనివారం హెచ్చరించారు. మండలం లోని 26 గ్రామపంచాయతీల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాజులూరు మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్‌ బి.సాయి సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం మండలం లోని గొల్లపాలెం, ఆర్యవటం, జగన్నాధగిరి, కాజులూరు గ్రామాల్లో గతంలో కోడిపందాలు జూదాలు నిర్వహించిన ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తులసీరామ్‌ రెవిన్యూ అధికారులు ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం గ్రామంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు ఎలుకల నివారణ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎస్‌.అలిసియా నర్సిన్‌, ఎన్‌.కె.బీబీ ఫాతిమా, ఆర్‌.దీప్తిరాణి, జి.ఉష్కీతులసి, వి.సాహిత్యలతో కూడిన బృందం ఎలుకల నివారణ మందు తయారీ, వాటిని వినియోగించే పద్ధతి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. బ్రోమాడయోలోన్‌, వంటనూనె, వరి నూకలను 2: 2: 96 నిష్పత్తిలో కలిపి 10 నుంచి 15 గ్రాముల మిశ్రమాన్ని చిన్న పొట్లాలు కట్టి ఎలుకల బొరియల వద్ద పెడితే ఎలుకలు వాటిని తిని మరణిస్తాయన్నారు.

పందేలకు బరులు సిద్ధం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్‌

ఒకవైపు పోలీసులు హెచ్చరికలు జారీచేస్తున్నప్పటికి, అనుమతులు చివరి క్షణంలో అయినా వస్తాయని ధీమాతో పందాల నిర్వాహకులు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తున్నారు. సంక్రాంతి పందాలకు కోడి పుంజులు సై అంటూ కాలు దువ్వుతున్నాయి. పందాలకు తయారు మచేసే పుంజుల జాతి, రంగులను బట్టి వేలాది రూపాయలు వెచ్చించి పందెం రాయుళ్ళు కొనుగోలు చేస్తారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే సంక్రాంతి పండుగకు సంబంధించి కోడిపందాల బరులు సిద్ధం అయ్యాయి. అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు, నాయకుల ఆధ్వర్యంలో పండగ మూడు రోజులు కోడి పందాలు నిర్వహిస్తారు. ఇప్పటికే కోడిపందాల బరులలో పందాలతోపాటు మద్యం దుకాణం, బిర్యాని పాయింట్‌, గుండాట, కూల్‌ డ్రింక్స్‌ పాయింట్‌, తినుబండారాల పాయింట్లకు వేలం పాటలను నిర్వహించినట్లు సమాచారం. కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శనివారం సామర్లకోటలో జిల్లా ఎస్‌పి సతీష్‌ కుమార్‌ హెచ్చరించారు. పోలీసు వర్గాలు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ నిర్వాహకులు తమ పనిలో నిమగ్న మయ్యారు. మొత్తం మీద పోలీస్‌ హెచ్చరికలు ఎంత వరకు పాటిస్తారో వేచి చూడాలి.

రూరల్‌ గ్రామంలో పందేలకు సిద్ధంచేస్తున్న గ్రౌండ్‌

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని కత్తిపూడి గ్రామానికి చెందిన వైసిపికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. కత్తిపూడి గ్రామానికి చెందిన యర్రంశెట్టి సత్యనారాయణ (బాబ్జి) గృహంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్‌ వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్న శివ నేతృత్వంలో వైసిపికి చెందిన నాయకుడు ఈశ్వరరావు, నాయుడు బుజ్జి, గౌతు దొరబాబు, రౌతు శివ, గౌతు కృష్ణారావులతో పాటు సుమారు వంద మంది టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి టిడిపి కండువాలు కప్పి వరుపుల సత్యప్రభ ఆహ్వానించారు. అనంతరం వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనపై ప్రజలు విసుగు చెందారని, రాష్ట్ర అభివృద్ధికి ఒక విజన్‌, లక్ష్యం గల నేత చంద్రబాబు నాయుడు ఒక్కరేనన్నారు. రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలు విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ తరుణంలోనే టిడిపిపైన, తనపైన నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికి కృతజ్ఞతలు తెలిపి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి బచ్చల గంగ, టిడిపి నేతలు కీర్తి సుభాష్‌, బద్ది రామారావు, రమణ, ఓలేటి లక్ష్మీనారాయణ, అరిగెల జగదీష్‌, గాబు కృష్ణ, సరమర్ల మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో సత్యప్రభ

శృంగార వల్లభ స్వామికి రూ 1.7 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.1,19,360, అన్నదాన విరాళాల ద్వారా రూ.47,122, కేశఖండన ద్వారా రూ.4,240 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం ,మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ చైర్మన్‌ కర్రి వెంకట జగదీశ్వరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్‌, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్‌, గ్రామస్తులు సేవలందించారు.

భోజనాలను వడ్డిస్తున్న నిర్వాహకులు

సంక్రాంతి ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

డివైఎఫ్‌ఐ, సిఐటియు, ఐద్వా, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సంయుక్త సంక్రాంతి ఆటల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ సభ్యులు సిరిపరపు బంగారు రాజు, రొంగల అరుణ్‌ కుమార్‌లు మాట్లాడుతూ యువతను సంక్రాంతి పర్వదినాల్లో వ్యసనాలకు, జూదాలకు, అశ్లీలతకు దూరంగా ఉంచేందుకు ప్రతి ఏడాది ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం శోభా థియేటర్‌ ప్రాంతంలో ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. శోభా థియేటర్‌, నువ్వుల గుంట వీధి, సుందరయ్య కాలనీ, సత్యమ్మ కాలనీలలో రెండు రోజులపాటు ముగ్గుల పోటీలు, యువతీ, యువకులకు, బాలలకు పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. శోభాథియేటర్‌ వీధిలో నిర్వహించిన ముగ్గుల పోటీలను అమత, నమత, గౌస్‌, బంగారు రాజు, అరుణ్‌, పూజిత, సుబ్బలక్ష్మి, వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్న మహిళలు

ముద్రగడను కలిసిన చిన్నయ్య దొర బృందం

ప్రజాశక్తి సామర్లకోట రూరల్‌

రాష్ట్ర కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ను రాష్ట్ర మున్సిపల్‌ కౌన్సిల్‌ చాంబర్‌ మాజీ అధ్యక్షులు, టిడిపి జిల్లా నాయకులు గోరకపూడి చిన్నయ్య దొర తన బృందంతో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాపు ఉద్యమ నేత పద్మనాభం టిడిపి, జనసేన పార్టీల్లో చేరతారా అని వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో డాక్టర్‌ చిన్నయ్య దొరతోపాటు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి తాతపూడి కృష్ణబాబు, జిల్లా కార్యదర్శి కాళ్ళ రవీంద్ర బాబు, జిల్లా బిసి సెక్రటరీ గోర్తీ సత్యనారాయణలు కలిశారు.

ముద్రగడతో చిన్నయ్య దొర, ఇతరులు

ఉత్సాహంగా సంక్రాంతి క్రికెట్‌ టోర్నమెంట్‌

ప్రజాశక్తి - కరప

మండల కేంద్రం కరపలో క్రికెట్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ కరప(సిఎకె) ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి క్రికెట్‌ టోర్నమెంట్‌ ఉత్సాహంగా సాగుతోంది. శనివారం కరప జడ్‌పి ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన రెండవ రోజు క్రికెట్‌ పోటీలను జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దేవు మధువీరేష్‌ టాస్‌ వేసి ప్రారంభించారు. రెండోరోజు ఏడు మ్యాచ్‌లు జరిగాయి. మొదట మ్యాచ్‌లో భీమ్‌ వారియర్స్‌ కరప, వేములవాడ జట్ల మధ్య పోటీ జరగగా భీమ్‌ వారియర్స్‌ కరప గెలుపొందింది. పెద్దాపురప్పాడు, సిరిపురం జట్ల మధ్య రెండో మ్యాచ్‌ లో సిరిపురం జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌ బావవరం సూపర్‌ కింగ్స్‌, నాలుగో మ్యాచ్‌ గురజానపల్లి-3, ఐదో మ్యాచ్‌ లో కరప మెరక వీధి, ఆరో మ్యాచ్‌ లో గురజానపల్లి-3, ఏడో మ్యాచ్‌ లో వేళంగి-2 జట్టు తమ ప్రత్యర్థి పెద్దాపురప్పాడు, కరప లెవెన్‌, జెడ్‌ భావవరం, భీమ్‌ వారియర్స్‌ కరప, గురజానపల్లి-2 జట్లపై విజయం సాధించాయి. పాల్గొన్న సత్య భీమేశ్వరరావు (భీమన్న), బండారు మురళీ, నిర్వాహకులు నక్కా భీమ్‌, గోన శివ, దేవు శివ, సిఎకె ఫ్రెండ్స్‌ లెవెన్‌ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్‌

మండలంలోని జె. కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో శనివారం వైసిపి నుంచి టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన చింతల వెంకటరమణ ఆధ్వర్యంలో నకిరెడ్డి కాటయ్య, నక్కన శివయ్య, రాజమండ్రపు స్వామి, చల్లా దుర్గ, ఉంగరాల నాగరాజు, చల్లా శ్రీను, నక్కన నాగరాజు, చల్లపురెడ్డి రమేష్‌,కందికట్ల రాజేష్‌, పలువురికి జ్యోతుల నెహ్రూ కండువాలతో పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టిడిపి మీద, నామీద, నమ్మకంతో టిడిపిలో చేరుతున్న వారందరికీ స్వాగతం పలుకుతున్నానని అన్నారు. అధికార పార్టీపై ఎన్నికల్లో పోటీ చేస్తున్న నరసింహం గత సంవత్సర కాలంగా ఆత్మీయ సమావేశాలతో నియోజకవర్గం అంతా తిరుగుతున్నాడని పుష్కర ఎత్తిపోతల పథకం తాళ్లూరు లిఫ్ట్‌కు నిధులు సమకూర్చి మరమ్మతులు చేసి ఉంటే రైతులందరూ పంటలు పండించుకునే వారిని ఇంతమంది నష్టపోయేవారు కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, దంట పెద్దకాపు, పార్టీ ప్రెసిడెంట్‌ చింతల కన్నారావు , బద్ధి సురేష్‌, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ

వైభవంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్‌

సంక్రాంతిని పురస్కరించుకొని రమణయ్యపేట మాజీ ఎంపిటిసి రాయుడు అనిల్‌ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు వైభవంగా నిర్వహించారు. శనివారం మండలపరిధిలోని రమణయ్యపేట ఎన్‌టిఆర్‌ కాలనీలో టిడిపి యువ నాయకులు పిల్లి కృష్ణ కళ్యాణ్‌ సహకారంతో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల హరివిల్లులు అల్లరింపజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్‌ మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణ కుమారుడు పిల్లి కృష్ణ కళ్యాణ్‌ మాట్లాడుతూ యువతకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాలన్న ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా గ్రామాల్లో యువత అసంఘిక కార్యక్రమాల వైపు వెళ్లకుండా అందరి కలయికతో గ్రామం కళకళలాడుతుందని, తద్వారా సుహుత్భావ వాతావరణ ఏర్పడి ఆధ్యాత్మిక నెలకొంటుందన్నారు. మహిళలు సాంప్రదాయ ముగ్గులు వేసి మన్ననలు పొందారన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న వాళ్లందరికీ ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుప్తా, మేడిశెట్టి ఏసు, గ్రామస్తులు రాందేవు శ్రీలక్ష్మి, జి.యశోద, సిహెచ్‌ దుర్గాప్రసాద్‌, యాదగిరి సత్యనారాయణ, దండా సత్యనారాయణ, కోరాడ తాతీలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులను పరిశీలిస్తున్న కృష్ణ కళ్యాణ్‌, తదితరులు

ఘనంగా వివేకానంద 161వ జయంతి

ప్రజాశక్తి - గండేపల్లి

స్వామి వివేకానంద 161వ జయంతి ఉత్సావాన్ని పురష్కరించుకుని ఆదిత్య ఇంజనీరింగ్‌ క్యాంపస్‌లో గ్రాంథాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుతగా వివేకానంద చిత్రపటానికి క్యాంపస్‌ డైరెక్టర్‌ మరియు ఆదిత్య ఇంజనీరింగ్‌ కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎం.శ్రీనివాసరెడ్డి పూల మాల వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వామి వివేకానంద కొన్ని సంవత్సరాలు మాత్రమే జీవించి ఉన్నప్పటికీ యావత్‌ ప్రపంచంలో గల మానవజాతికి అమూల్యమైన భావజాలాన్ని అందించి చిరంజీవిగా అందరి హదయాలలో నిలిచారని కొనియాడారు. రాజమహేంద్రవరం శ్రీరామకృష్ణ మఠం స్వామిజీ స్వామి సేవ్యానంద పాల్గొని వివేకానందుని జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు ఉపాధ్యాయులకు అందించి వివేకానందుని గురించి అందరూ తెలుసుకుని ఆయన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్‌ అడ్మినిస్ట్రేషన్‌ ప్రొఫెసర్‌ వి.సత్య నారాయణ, గ్రంథాలయ శాఖ ప్రధాన అధికారి కె.అశోక్‌ కుమార్‌, పెదబ్రహ్మదేవం శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్‌, గ్రంథాలయ సిబ్బంది సోమరాజు, రమ్య, గిడుతూరి వెంకటేష్‌ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే బిజినెస్‌ స్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ డాక్టర్‌ సంజయ్‌ కుమార్‌, వైస్‌ ప్రిన్సిపల్‌ కె.విజయభార్గవి, ఎంబిఎ విభాగం అధిపతి డాక్టర్‌ ఎం.గోవర్ధన్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ ఎం.ధర్మరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద స్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్

యానాం వార్తలు

పోలీసులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీసుశాఖ పరిధిలోని వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 87 మంది పోలీసులకు స్పెషల్‌ గ్రేడ్‌ ఉద్యోగన్నతితులు కల్పిస్తూ పోలీసుశాఖ అండర్‌ సెక్రటరీ ఎంవి.హీరన్‌ జాబితా విడుదల చేశారు. వేతనం పెంపుతో ప్రమేయం లేకుండా పదేళ్లు పనిచేసిన కానిస్టేబుల్స్‌కు హెడ్‌ కానిస్టేబుల్‌గానూ, 15 ఏళ్లు దాటితే ఎఎస్‌ఐ, 25 ఏళ్లు దాటితే ఎస్‌ఐగా పదోన్నతి కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే యానాం పోలీసుశాఖలో పనిచేస్తున్న జెబివి.స్వామి, ఎస్‌.అప్పారావు, డి.చిట్టిబాబు, కె.సుబ్రహ్మణ్యం, పి.జితేష్‌కుమార్‌, డిఎల్‌ సీతారత్నం, కెవి.రమణమూర్తి, డి.పట్టాభి రామయ్య, జెబివి.సుబ్బారావు, పి.సత్య నారాయణ, పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, సంపత్‌ కుమార్‌ తదితరులకు ఎస్‌ఐలుగా, కోన సర్వేశ్వరరావు తదితర 33 మందిని ఎఎస్‌ఐలుగా, 42 మందికి హెడ్‌ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి కల్పించినట్లు చెప్పారు. సంక్రాంతి పండగ రోజుల్లో వారు పదోన్నతి పొందడం సంతోషకరమని అన్నారు. వీరికి బంధుమిత్రులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ముగిసిన మార్నింగ్‌ స్టార్స్‌ షటిల్‌ టోర్నీ

షీల్డ్‌లను అందుకుంటున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - కాకినాడ

ఆఫీసర్స్‌ క్లబ్‌ మార్నింగ్‌ స్టార్స్‌ షటిల్‌ టోర్నీ ఉత్సాహంగా ముగిసింది. విన్నర్స్‌గా యు రామకృష్ణ, నవీన్‌ నిలిచారు. సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం కాకినాడ ఆఫీసర్స్‌ క్లబ్‌ లో షటిల్‌ టోర్నీ నిర్వహించారు. లీగ్‌ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో సుమారు 16 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో రన్నర్స్‌గా తాతాజీ, పీటర్‌ నిలిచారు. అనంతరం కాకినాడ బాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు, రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కెబిఎ స్టేడియం నిర్వాహకులు కృష్ణంరాజు చేతులమీదుగా విజేతలకు షీల్డ్‌లు అందజేశారు. ఈ టోర్నీలో ఎఎస్‌ఐ చౌదరి, గ్రంధి రాజా తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సిఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎంఎల్‌ఎ కన్నబాబు

ప్రజాశక్తి - కాకినాడరూరల్‌

పేదలకు సిఎం సహాయనిధి భరోసా కల్పిస్తున్నదని ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు అన్నారు. శనివారం కాకినాడ రూరల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు సుమారు రూ.22 లక్షల 20 వేల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరంగా మారుతున్నందన్నారు. ఆరోగ్య శ్రీ సేవల కిందికి రాని శారీరక రుగ్మతలకు ఈ పథకం ఆపన్నహస్తంలా నిలుస్తున్నదని చెప్పారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందాలని ఆయన సూచించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీదే విజయం

ప్రజాశక్తి - కోటనందూరు

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ విజయం సాధిస్తుందని జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు డాక్టర్‌ పాండురంగారావు అన్నారు. శనివారం కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు రాహుల్‌ గాంధీ సంక్షేమ పాలన కోరుకుంటున్నారని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి అగ్రవర్ణ పేదలు ఇందరమ్మ పరిపాలనతోనే వారికి మేలు చేకూరుతుందనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారని అన్నారు. ఇతర పార్టీలపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ పార్టీ ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అధిష్టానం కార్యచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి కుమార్తె వైఎస్‌ షర్మిల కాంగ్రెస్‌ పార్టీలోకి రావడం శుభ పరిణామమని అన్నారు.

ఎంపిటిసి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని అల్లిపూడి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఎంపిటిసి సభ్యురాలు నెమ్మది నాగమణి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వైసిపి మండల కన్వీనర్‌ చింతకాయల చినబాబు, ఎంపిపి లగుడు శ్రీనివాస్‌ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మానవతాదృక్పథంతో ఒక లక్ష రూపాయల నగదును కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్‌ లంక ప్రసాద్‌, గరిసింగు లచ్చరావు, గోవర్ధన, వార్డు సభ్యులు రమణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్‌

ఎపిఐఐసి కాలనీలో కోరమండల్‌ మహిళా క్లబ్‌ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్‌ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్‌ అధ్యక్షురాలయిన వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. సమాజ సేవలో ప్రధానమైనది మానవ సేవ అని వీటితోనే భగవంతుని అనుగ్రహం లభిస్తుందని అన్నారు. ఒకరికి చేసిన ఉపకారమే మనిషికి మిగిలే నిజమైన సిరి అని అన్నారు.

దస్తావేజు పోయినది

నా క్లయింట్లు అయిన కాకినాడ, సాంబమూర్తి నగర్‌, జ్యోతుల కాలనీ, డో.నెం. 16-33-94రు కాపురస్తులు **(లేటు) మహమ్మద్‌ చాన్‌ భాషా గారి కుమారులు అయిన 1) షేక్‌ అహమద్‌ మరియు 2) షేక్‌ అక్తర్‌ గార్లు** నాకు ఇచ్చిన సంజాయిషీమేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.

తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), కాకినాడ అర్బన్‌ మండలం, కాకినాడ సబ్‌-రిజిస్ట్రీలో చేరిన, కాకినాడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఏరియా, సాంబమూర్తి నగర్‌, జ్యోతుల కాలనీ, వార్డు నెం. 2, బ్లాకు నెం. 11, ప్రజెంట్‌ బ్లాకు నెం. 16, టి.ఎస్‌. నెం. 835/2, 836/8 దాఖలా 112 చ॥గ॥లు లేక 93.64 చ॥మీ॥లు స్థలం, అందుల డో.నెం. 16-33-94రు గల ఇల్లు నా క్లయింట్లు యొక్క తండ్రి గారు కొనుగోలు చేసి, వారి జీవితకాలంలో నా క్లయింట్లుకు దఖలుపరచి ఉన్నారు. సదరు ఆస్తి తాలూకు లింకు దస్తావేజు అనగా నా క్లయింట్లు తండ్రిగారికి క్రియపర్చిన గంగాపాత్రుని జగదీశ్వరి పేరగల ది.28-07-1998 తేదీగల ఒరిజినల్‌ క్రియ దస్తావేజు నెం.4722/1998, SRO, కాకినాడను, నా క్లయింట్లు ది. 09-01-2024 తేదీన హౌసింగ్‌ లోన్‌ నిమిత్తం వారి ఇంటి వద్ద నుండి కాకినాడ, సూర్యారావుపేటలో గల యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా వద్దకు మోటార్‌ సైకిల్‌పై వెళ్ళుచుండగా, దారి మార్గంలో సదరు దస్తావేజు గల కవరు పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇఫ్తేఖార్‌ మహమూద్‌, అడ్వకేట్‌
డో.నెం. 5-2-43/1ఎ, మాదిరెడ్డివారి వీధి,
కాకినాడ. సెల్‌: 9848424875